
7
సాక్షి
జగిత్యాల
ఆదివారం । 18 । జూన్ । 2023



ప్రపంచానికి మనల్ని చూపేది అమ్మ.. ప్రపంచాన్ని మనకు చూపేది నాన్న. అమ్మ జన్మనిస్తే.. నాన్న ఆ జన్మకు రూపమిస్తారు. తల్లి అంటే ఎంత ప్రేమో...తండ్రి అంటే కూడా అంతే ప్రేమ. నాన్న గంభీరంగా ఉంటారు.. అందుకే పిల్లలు నాన్నకు భయపడతారు. కానీ.. నాన్నకు ఏదైనా ఇబ్బంది వస్తే మాత్రం పిల్లలు సెకను కూడా ఆగలేరు. అదే పిల్లలకు, నాన్నకు మధ్య ఉన్న అనుబంధం. తండ్రి పిల్లల కల నెరవేర్చడానికి కష్టపడుతుంటారు. ఎన్నో త్యాగాలు చేసి పిల్లల మొహంలో సంతోషాన్ని నింపాలనుకుంటారు. అదే నాన్న గొప్పతనం. నేడు ఫాదర్స్ డే.. ఈ సందర్భంగా నాన్నతో పలువురి బంధం.. అనుబంధం..

నాన్న కష్ట జీవి



సాక్షిప్రతినిధి కరీంనగర్/కరీంనగర్: మాది వెల్గటూర్ మండలం పైడిపల్లి. వ్యవసాయక కుటు ంబం. నాన్న గంగుల మల్లయ్య పటేల్. వ్యవసాయం, కాంట్రాక్ట్ పనులు చేయించేది. నలు గురు అన్నదమ్ములమైన మమ్మల్ని ఉన్నతంగా చదివించాలని ఆరాటపడేవారు. గ్రామంలో ఎ వరికీ ఏ ఆపద వచ్చినా.. డబ్బులు సర్దుబాటు చేసేవారు. నాన్న ప్రోత్సాహంతో రాజకీయాల్లో చేరి 25ఏళ్లుగా కౌన్సిలర్, కార్పొరేటర్, ఎమ్మె ల్యే, మంత్రిగా ప్రజాసేవ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. నాన్న పేరు నిలబెట్టాననే ఆనందం ఉంది.

– గంగుల కమలాకర్, రాష్ట్ర మంత్రి

పుస్తక పఠనంపై ఆసక్తి



సాక్షిప్రతినిధి కరీంనగర్/కరీంనగర్: నాన్న జనసేషన్ వీరరాఘవన్ కవి. ఉద్యోగ రీత్యా లైబ్రేరియన్ కావడంతో నాకు చిన్నప్పటి నుంచి పుస్తక పఠనంపై ఆసక్తి. నాన్న రాసిన కథల నుంచి స్ఫూర్తి పొంది చదువుపై మమకారం పెరిగింది. నాన్న చూపిన చొరవ నన్ను సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావడానికి దోహదపడింది. – ఆర్వీ కర్ణన్, కరీంనగర్ కలెక్టర్

జీవిత గురువు



జగిత్యాల: నాన్న మాకునూరి హన్మంతరావు 63ఏళ్లుగా న్యాయవాదిగా పనిచేశారు. ఆయనే నా తొలిగురువు. నాన్న ప్రోత్సాహంతోనే వైద్య, రాజకీయ రంగంలోకి వచ్చా. నాన్నకు వ్యవసాయమంటే మక్కువ. ఆయన ఆలోచనకు అనుగుణంగా మెడిసిన్ పూర్తి చేసి నేత్రవైద్యుడిగా ఇప్పటివరకు 30వేల మందికి పైగా ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేశాను. ఎమ్మెల్యేగా ఎంతబిజీగా ఉన్నా వైద్య వృత్తిని కొనసాగిస్తున్నా. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా సాయంత్రం కాసేపు నాన్నతో మాట్లాడితే ఒక స్నేహితుడితో మాట్లాడిన ఫీలింగ్ ఉంటుంది. నాన్నే నాకు ఆత్మీయ మిత్రుడు.

– సంజయ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే

ప్రోత్సాహం మరువలేనిది



నాన్న సత్యనారాయణమూర్తి ఎస్‌బీఐలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. కుటుంబ బాధ్యతలు అన్ని భుజాన వేసుకున్నారు. కష్టపడి అందరినీ ప్రయోజకులను చేశారు. నన్ను డాక్టర్ కావాలని సూచించేవారు. ఇంజినీరింగ్‌పై ఆసక్తితో నేను బీటెక్ పూర్తి చేసి.. గ్రూప్స్‌రాసి ఉద్యోగం సాధించాను.

– ప్రియాంక, జెడ్పీ సీఈవో, కరీంనగర్

నాన్నే స్ఫూర్తి



నాన్న సుగుణాకర్‌రావు అలియాస్ రాజేశ్వరరావు వృత్తి రీత్యా కాంట్రాక్టర్. చిన్నప్పటి నుంచే నాన్నలోని ముక్కు సూటితనం, ధైర్యం సేవా గుణం ఆకట్టుకుంది. చదువుకుంటున్న సమయంలోనే నాకు రాజకీయ లక్షణాలు వచ్చాయి. 20 ఏళ్లుగా రాజకీయ పదవులలో కొనసాగుతూ ప్రజలకు సేవ చేసే విషయంలో నాన్నే స్ఫూర్తి.

– వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

బట్టలు కుట్టి..



పాలకుర్తి: నాన్న దర్జీ పని చేస్తూ చదివించారు. ప్రస్తుతం భౌతికంగా లేకపోయినా.. ఆయన ఆలోచన విధానాలు మా వెంటే ఉన్నాయి. బసంత్‌నగర్‌లో నాన్న పరికిపండ్ల సత్యనారాయణ స్మారకార్థం ఉచిత కంటి ఆసుపత్రి నిర్మించి పేదలకు సేవ చేస్తున్నాం.

– పరికిపండ్ల నరహరి, మధ్యప్రదేశ్ రాష్ట్ర ఐఅండ్ పీఆర్ కమిషనర్

కొండంత అండ



సాక్షి, పెద్దపల్లి: నాన్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ. రాజకీయాల్లో బిజీగా ఉన్నా నాకోసం రోజూ కొంత సమయం కేటాయించేవారు. బాల్యంలో చదువు నిర్లక్ష్యం చేయవద్దని కొంత కఠినంగా చెప్పినా, ఉన్నత చదువులు, వృత్తిని ఎంచుకునే సమయంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. నాన్న నాకు మంచి స్నేహితుడు, అంతకు మించి విమర్శకుడు. నేను ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తరువాత మనం ఒకప్పుడు పేదవాళ్లమే.. సాయం కోసం నీ దగ్గరకు వచ్చే వారితో సొంత మనిషిలా వ్యవహరిస్తూ.. సమస్య పరిష్కరించడానికి ప్రయత్నించాలని చెప్పారు. ఇప్పటికీ నాన్న ఇచ్చే సలహాలనే పాటిస్తా.

– డాక్టర్ సంగీత సత్యనారాయణ, కలెక్టర్ పెద్దపల్లి

నాన్న నుంచే కష్టపడే తత్వం..



సిరిసిల్లక్రైం: నాన్న రాకేశ్‌కుమార్ గుప్తా. కిరాణం నడిపేవారు. ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల వరకు షాపు నడపడం చూశా. సామాజిక సేవకు నాన్నే గురువు. తనతో సంతోషంగా గడిపిన రోజులు చాలా ఉన్నాయి. నేను ఐపీఎస్‌కు ఎంపికయ్యాక నాన్నతో కలిసి దిగిన ఫొటో నేనెప్పుడూ మరిచిపోలేను.

– అఖిల్ మహాజన్, ఎస్పీ, రాజన్న సిరిసిల్ల

నాన్న మాటలే దారి చూపాయి



సాక్షిప్రతినిధికరీంనగర్/కరీంనగర్: నాన్న లక్ష్మయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఇంటినుంచి వెళ్లాలంటే కలెక్టర్ కార్యాలయం ముందు నుంచే వెళ్లేవారు. కలెక్టర్ అంటే జిల్లాకు అధికారి అని ఏ పని అయినా చేయవచ్చునని నాన్న ఇతరులతో మాట్లాడే సందర్భాలు నన్ను కదిలించాయి. ప్రతీరోజు దినపత్రికలు చదివే నాన్నను చూసి నేనూ పేపర్లు చదివేవాడిని. ఆయన స్ఫూర్తితోనే సివిల్స్‌లో 94వ ర్యాంకు సాధించాను.

– ఆవుల సాయికృష్ణ, సివిల్స్ ర్యాంకర్, కరీంనగర్

బడిలో..ఇంట్లో పాఠాలే చెప్పారు



కోరుట్ల: నాన్న అంజిరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. వ్యవసాయం కూడా ఉండడంతో పొలం, స్కూల్ రెండూ చూసుకునేవారు. మేము చదువుపై దృష్టి పెట్టేలా శ్రద్ధ తీసుకునేవాడు. ప్రభుత్వ టీచర్ అయినా జీతం తక్కువే . అమ్మ పుష్పలత వ్యవసాయ పనులు చూస్తూ ఉండటం.. వచ్చే డబ్బులతో నా చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. సివిల్స్ ఫలితాలు వచ్చిన రోజు నేను ఢిల్లీలోనే ఉన్న. నాన్నకు ఫోన్ చేసి 132వ ర్యాంకు వచ్చిందని చెప్పగానే ఉద్వేగంతో..'కంగ్రాట్స్'అన్నారు. నాన్న కల నెరవేర్చానన్న తృప్తి మిగిలింది.

– ఏనుగు శివమారుతిరెడ్డి, సివిల్స్ ర్యాంకర్, కోరుట్ల

సజ్జలు అమ్మి చదివించారు



సిరిసిల్ల: మాది నల్గొండ జిల్లా దేవరకొండ మండలం గాజినగర్. అమ్మ పార్వతి, నాన్న మాన్యానాయక్. నలుగురం అన్నదమ్ములం, ఐదుగురు అక్కలు. నేను చిన్నోడిని. నన్ను చెల్లెను మాత్రమే చదివించారు. నాన్న వ్యవసాయం చేసేవారు. నీటి వసతి లేని భూమి ఉండేది. మా ఊరి దగ్గర పెళ్లిపాకల చెరువులో చేపలు పట్టేవారు. నేను దేవరకొండలో హాస్టల్‌లో ఉండి చదువుకున్న. ఇంటర్ బైపీసీలో సైన్స్‌బాక్స్ కొనేందుకు డబ్బులు లేకపోతే ఇంట్లోని సజ్జలు అమ్మారు. నాకు వ్యవసాయ పనులు నేర్పించారు. డిగ్రీ కాగానే స్పెషల్ టీచర్‌గా పని చేశా. ఆర్టీసీ కండక్టర్‌గా, గోదాం మేనేజర్‌గా చేశా. 1995లో గ్రూప్–2 ద్వారా రెవెన్యూశాఖలో ఉద్యోగం వచ్చింది. నేను తహసీల్దార్‌గా ఉండగా.. 2007లో నాన్న చనిపోయారు. నేను ఈ రోజు ఈ స్థాయికి వచ్చానంటే నాన్న చలువే.

– నేనావత్ భీమ్యానాయక్, అదనపు కలెక్టర్, రాజన్న సిరిసిల్ల



తండ్రి జ్ఞాపకంగా విగ్రహం

జమ్మికుంట: ఇప్పటివరకు రాజకీయనాయకులు.. ఉన్నతమైన వ్యక్తులకు మాత్రమే విగ్రహాలు ఏర్పాటు చేయడం చూశాం. కానీ.. ఓ తండ్రి చనిపోతే.. ఆయన జ్ఞాపకంగా విగ్రహం ఏర్పాటు చేశారు అతని పిల్లలు. అక్కడే ఏటా జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారు. జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన పొట్లపల్లి జయరామారావు పట్వారి. పట్వారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశాడు. తెలంగాణ తొలి ఉద్యమ సమయంలో రాజకీయాల్లోకి వచ్చారు. జమ్మికుంట జెడ్పీటీసీగా పనిచేశాడు. మూడేళ్లక్రితం అనారోగ్యంతో చనిపోయాడు. ఆయన కొడుకు పొట్లపల్లి శ్రీధర్‌బాబు, కూతురు కంకటి శ్రీదేవి వ్యవసాయక్షేత్రం జయరామారావు విగ్రహం ఏర్పాటు చేశారు. ఏటా జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారు.

మా ఫాదర్ గ్రేట్



కోల్‌సిటీ(రామగుండం): మా నాన్న బుచ్చిరాజం. నాతో ఫ్రెండ్‌లా ఉంటారు. హిందీ టీచర్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. ఇప్పుడు 82 ఏళ్లు. నాన్న నన్ను డాక్టర్ చేయాలనుకున్నారు. కానీ బీటెక్ చేసి, మున్సిపల్ కమిషనర్ అయ్యా. ప్రయోజకుడివయ్యావని అభినందించారు. ఇంత వయసొచ్చినా నాన్నకు ఇంకా నేను పిల్లాడినే. 1991లో హైదరాబాద్ జేఎన్‌టీయూలో బీటెక్ చదువుతున్న సమయంలో ఒకరోజు జగిత్యాలలోని మా ఇంట్లో భోజనం తయారు చేసి బస్సులో పట్టుకొచ్చాడు. కాసేపు మాట్లాడితే సంతృప్తిగా ఉంటుంది. మా ఫాదర్ గ్రేట్.

– బి.సుమన్‌రావు, కమిషనర్, రామగుండంనగరపాలక సంస్థ

కిడ్నీ ఇచ్చి బతికించారు



మాది గోదావరిఖనిలోని రమేశ్‌నగర్. ప్రస్తుతం కర్నాటకలో బళ్లారిలోని ఓ స్టీల్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్న. నాన్న కిష్టయ్య సింగరేణిలో పని చేసి రిటైర్ట్ అయ్యారు. నాకు 2004లో కిడ్నీలు చెడిపోయాయి. ఎవరైనా కిడ్నీ దానం చేస్తే తప్ప బ్రతకడం కష్టమని డాక్టర్లు చెప్పారు. దీంతో నాన్న, అమ్మ సుశీల ఆర్థికంగా, మానసికంగా చాలా కష్టపడ్డారు. ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై ఉన్న నాకు కిడ్నీదానం చేయడానికి నాన్న ముందుకు వచ్చారు. చాలా మంది వద్దని వారించారు. కానీ నా కొడుకు బతుకు ముఖ్యమంటూ కిడ్నీఇచ్చి నన్ను బతికించుకున్నాడు.

– పోతర్ల జయాకర్ రాజు, సీనియర్ మేనేజర్, బళ్లారి, కర్నాటక

న్యూస్‌రీల్

సబ్ జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జడ్జి ప్రసాద్

జగిత్యాలజోన్: స్థానిక స్పెషల్ సబ్ జైలులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్ మాట్లాడుతూ, జైలు జీవితం తర్వాత తిరిగి నేరాలు చేయవద్దన్నారు. పదేపదే నేరాలకు పాల్పడితే శిక్షలు కూడా కఠినంగానే ఉంటాయని జడ్జి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ వార్డర్ మజారొద్దీన్, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని శనివారం వేలాది మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఆషాఢ మాసం ప్రారంభం కానుండడంతో భక్తులు భారీసంఖ్యలో కొండపైకి తరలివచ్చారు. ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. నిత్యాన్నదాన సత్రంలో భోజనాలు చేసిన భక్తులు.. ఆ తర్వాత తిరుగుపయనమయ్యారు.

లెక్క తేలాల్సిందే..!

- కోరుట్ల రైస్‌మిల్లులో వడ్లు మాయం
- అప్రమత్తమైన జిల్లా పౌర సరఫరాల అధికారులు
- జిల్లావ్యాప్తంగా తనిఖీలకు ప్రత్యేక ప్రణాళిక!



వడ్ల నిల్వలు మాయమైన రైస్‌మిల్లు ఇదే

కోరుట్ల: పట్టణ పరిధిలోని ఓ రైస్ మిల్లులో పౌర సరఫరాల శాఖ అధికారులు శుక్రవారం సాయంత్రం తనిఖీలు చేశారు. సుమారు 4 వేల క్వింటాళ్ల వడ్లు మాయమైనట్లు గుర్తించారు. అప్రమత్తమైన అధికారులు.. జిల్లాలోని మిగతా రైస్ మిల్లుల్లోనూ తనిఖీలు చేసేందుకు సిద్ధమయ్యారని సమాచారం.

మిల్లుల్లో రెండు సీజన్ల ధాన్యం..

- జిల్లా వ్యాప్తంగా 72 బాయిల్డ్, 68 రా రైస్ మిల్లులు ఉన్నాయని అధికారుల సమాచారం.
- పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో గత వానాకాలంలో 4.26 లక్షల మెట్రిక్ టన్నులు, ఈ యాసంగిలో సుమారు 4.09 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు.
- ఈ ధాన్యాన్ని అధికారులు ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించారు.
- ప్రస్తుతం మిల్లుల్లో రెండు సీజన్ల వడ్లు ఉండాలి.
- అయితే, ఎఫ్‌సీఐ, ప్రభుత్వానికి ఎప్పుడైనా, ఎలాగైనా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్) సమకూర్చ వచ్చనే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం స్వీకరించిన కొందరు మిల్లర్లు.. బహిరంగ మార్కెట్‌లో ముందుగానే అధిక ధరలకు విక్రయించారనే ఆరోపణలు వచ్చాయి.
- ఈ విషయం వెలుగులోకి రావడం, నిర్దేశిత సమయంలో మిల్లర్లు సీఎమ్మార్ అప్పగించకపోవడంతో అధికారులు జరిమానా విధించారు.
- అయినా, రైస్‌మిల్లర్లలో పెద్దగా చలనం రాలేదు.
- దీనిని దృష్టిలో పెట్టుకున్న సివిల్ సప్లయి అధికారులు ఈసారి రైస్‌మిల్లుల్లోని ధాన్యం నిల్వల లెక్క తేల్చేందుకు తనిఖీలు చేపట్టారు.

ఇలా లెక్క తేల్చుతున్నారు..

- సాధారణంగా ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలిస్తున్నారు. ఇలా తీసుకెళ్లిన వెంటనే కుప్పలు వేసేందుకు గతంలో సరైన పద్ధతులు అనుసరించేవారు కాదు. ప్రస్తుతం సివిల్ సప్లయి అధికారులు సూచించిన పద్ధతిలో రైస్‌మిల్లర్లు సాధారణ రకం, గుజరాతీ రకంలో వడ్ల సంచులను కుప్పలుగా వేసి ఉంచుతున్నారు. సాధారణ రకంలో వడ్ల సంచులు ఒకదానిపై ఒకటి వేస్తుండగా, గుజరాతీ రకంలో రెండు బస్తాలు నిలువు, ఒక బస్తా అడ్డుగా వేస్తున్నారు. ఇలా వేసిన ధాన్యం బస్తాల కుప్పల పొడవు, వెడల్పు, ఎత్తు ఆధారంగా సివిల్ సప్లయి టెక్నికల్ అసిస్టెంట్స్ లెక్కలు తీస్తున్నారు. దీనిప్రకారం వడ్ల సంచుల లెక్క పక్కాగా తేలుతోంది. శుక్రవారం సాయంత్రం కోరుట్లలోని ఓ రైస్ మిల్లులో చేపట్టిన ఈ పద్ధతి లెక్కలతోనే సుమారుగా 4వేల క్వింటాళ్ల వరకు వడ్ల బస్తాలు మాయమైనట్లు తేల్చారు. ఇదే పద్ధతిలో జిల్లాలోని మిగతా అన్ని రైస్‌మిల్లుల్లోనూ వడ్ల నిల్వల లెక్క తేల్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో వేడుకలు



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా, వేదికపై అదనపు కలెక్టర్ మకరంద్, అధికారులు

- ఘనంగా హరిత దినోత్సవం, మంచినీళ్ల వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు
- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో జిల్లా ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా కోరారు. ఇందులో భాగంగా మంచినీళ్ల దినోత్సవం, హరిత దినోత్సవం, విద్యా దినోత్సవం, ఆధ్యాత్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి శనివారం కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్‌బాషా.. జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విద్యార్థులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు వేడుకల్లో అధికంగా పాల్గొనేలా చూడాలని కోరారు. పండుగ వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. తెలంగాణ హరితోత్సవంలో మొక్కలు నాటించాలని, ఫొటో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇబ్రహీంపట్నం మండలం డబ్బాలో మంచినీళ్ల దినోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

గిరిజనుల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- ఘనంగా గిరిజన దినోత్సవం

రాయికల్:(జగిత్యాల): గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంక్యానాయక్, అల్యానాయక్ తండాల్లో శనివారం గిరిజనోత్సవం నిర్వహించారు. అల్యానాయక్ తండాలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ యాస్మిన్ బాషా పాల్గొన్నారు. తొలుత రూ.20లక్షల వ్యయంతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సంజయ్ మాట్లాడారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసి వారికి సంక్షేమానికి పెద్దపీట వేశామన్నారు. గిరిజనులకు పది శాతం రిజర్వేషన్ల పెంపు, ఆదివాసీలు, గిరిజనులకు పోడు భూములపై యాజమాన్య హక్కులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. కలెక్టర్ యాస్మి న్‌బాషా మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. అదనపు కలెక్టర్ మకరంద్, ఎంపీపీ లావుడ్యా సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచులు నందునాయక్, బండారీ, ఎంపీడీవో సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన తండావాసులు

'కార్మికుల గోడు పట్టదా?'

మల్లాపూర్(కోరుట్ల): 'గల్ఫ్ కార్మికుల సంక్షేమం ప్రభుత్వానికి పట్టదా' అని గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక దమామ్ ఇన్‌చార్జి బాలసాని లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. సౌదీలోని దమామ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పరాయిదేశంలో వలసకార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. ప్రభుత్వాలు అండగా నిలవడం లేదని విమర్శించారు. వారిని ఆదుకునేందుకు ఎన్ఆర్ఐ పాలసీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

పరామర్శ



నివాళి అర్పిస్తున్న హైకోర్టు జడ్జి

ధర్మపురి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు సతీమణి జువ్వాడి సుమతి దేవి ఇటీవల మృతిచెందారు. శనివారం హైకోర్టు జడ్జి జువ్వాడి శ్రీదేవి తిమ్మాపూర్‌లోని రత్నాకర్‌రావు కుటుంబాన్ని పరామర్శించి మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రత్నాకర్‌రావు కుమారులు జువ్వాడి నర్సింగరావు, నవనీత కృష్ణారావు, చంద్రశేఖర్ రావు, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నియామకం

కథలాపూర్(వేములవాడ): తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఇప్పపెల్లి గ్రామానికి చెందిన యాగండ్ల రమేశ్ గౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు లింగమూర్తి పటేల్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. రమేశ్‌గౌడ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తూ పలు సామాజిక కార్యక్రమాల్లో సేవలందించారని వారు పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర నాయకులు తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర నాయకులకు రమేశ్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

బీసీలకు ఆర్థికసాయం గడువు తేదీని పొడిగించాలి

ధర్మపురి : బీసీలకు ప్రభుత్వం అందించే రూ.లక్ష సాయం దరఖాస్తు గడువు తేదీని పొడిగించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేశ్ అన్నారు. ఈనెల 20 చివరి తేదీ కావడంతో బీసీ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పథకానికి దరఖాస్తు చేసుకునే వారికి కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, సర్వర్ సమస్య, కార్యాలయాల్లో కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో తదితర సమస్యల కారణంగా దరఖాస్తు తేదీని పొడిగించాలని కోరారు.

తండ్రి మందలించాడని కూతురు ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తండ్రి మందలించాడని కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కవరాధా జిల్లా చిరుపానికి చెందిన అర్జున్‌రాం సాహు అనే వ్యక్తి మండలంలోని రాచర్లగొల్లపల్లిలో భవన కార్మికునిగా పనిచేస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో కుటుంబ సభ్యులు నెల రోజుల క్రితం రాచర్లగొల్లపల్లికి వచ్చారు. ఇంటి పనులు సరిగ్గా చేయడం లేదని తండ్రి కూతురు అంజుసాహు(14)ను మందలించాడు. తండ్రి మందలించడంతో 8వ తరగతి చదువుతున్న అంజుసాహు శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగింది. పురుగుల మందు తాగడంతో పరిస్థితి విషమించి శనివారం మృతిచెందింది. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గల్లీకో మెడికల్ ల్యాబ్

- ప్రజారోగ్యంపై పట్టింపేదీ ?
- నిబంధనలకు విరుద్ధంగా పరీక్ష కేంద్రాల నిర్వహణ
- రోగుల నుంచి ఇష్టారాజ్యంగా వసూలు
- పట్టించుకోని వైద్యశాఖ అధికారులు



చిన్నపాటి ప్రహరీ మధ్య ఓ వీధిలో ఏర్పాటు చేసిన ల్యాబ్

జగిత్యాల: ప్రజల ఆరోగ్యంతో పరీక్ష కేంద్రాల (ల్యాబ్) నిర్వాహకులు చెలగాటమాడుతుండటంతో పాటు ప్రజల నుంచి అందినంత దోచుకుంటున్నారు. ల్యాబ్ ఏర్పాటు చేయాలంటే వైద్యశాఖ నుంచి అనుమతులు తీసుకొని ఏర్పాటు చేయాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా గల్లీకో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. చిన్నపాటి శిక్షణ పొందుతూ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నారు. ఏళ్ల నుంచి తతంగం కొనసాగుతున్నా వైద్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ల్యాబ్ ఏర్పాటు చేయాలంటే సుమారు 100 స్క్వేర్ ఫీట్స్ ఉండటంతో పాటు అన్ని మిషన్లు ఉండాలి. ఎలాంటి మిషన్లు లేకుండానే ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నారు. ఎంబీబీఎస్ డాక్టర్‌తో పాటు పాథాలజిస్ట్, టెక్నీషియన్స్, మైక్రో బయాలజిస్ట్ ఉండాలి. కానీ ఎక్కడా మచ్చుకైనా కన్పించడం లేదు. పరీక్ష చేసే కిట్లలో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

గల్లీకో ల్యాబ్

జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో ల్యాబ్‌లు, రక్తపరీక్షా కేంద్రాలు వెలిశాయి. ఆస్పత్రుల్లో, ల్యాబ్‌ల్లో పనిచేసిన వారు ఎలాంటి అర్హత లేకున్నా అనుమతులు లేకుండానే గల్లీ కొకటి ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం ప్రశాంతమైన వాతావరణంతో పాటు ల్యాబ్‌లో ఏసీలు ఉండి సెల్‌కాన్ మిషన్లు ఉండాలి. కానీ ఏదో చిన్నపాటి మిషన్లు ఏర్పాటు చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు.

అదనంగా వసూలు..

కొన్ని ఆస్పత్రులకు అనుసంధానంగా ల్యాబ్‌లు లేకపోవడంతో వైద్యుడు రాసిన పరీక్షలకు చిన్నచిన్న కేంద్రాలకు వెళ్తుంటారు. వైద్య పరీక్షలకు దాదాపు రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. రూ.100కు నిర్వహించే పరీక్షకు రూ.500 వరకు బిల్లులు వేస్తున్నారు. నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు ఉన్న ల్యాబ్‌లో చెకప్ చేయించుకోవాల్సి ఉంటుంది. కానీ కమిషన్లు ఇచ్చుకుంటూ తమ ల్యాబ్‌లకుపంపించాలంటూదందాకుతెరలేపుతున్నారు.

ఆఫర్ల పేరిట దోపిడీ..

రక్త పరీక్ష, మూత్రపరీక్షలే కాకుండా వివిధ రకాల పరీక్షలు చేస్తామంటూ ఆఫర్లు పెడుతున్నారు. థైరాయిడ్ ప్రొఫైల్, కిడ్నీ, లివర్, లిపిడ్ ప్రొఫైల్ లాంటి పరీక్షలు రూ.450కి రూ.200కే చేస్తామంటూ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. లివర్ ప్రొఫైల్ సైతం 500కు రూ.340కే, రూ.వెయ్యికే 50 రకాల టెస్ట్‌లు చేస్తామని మభ్యపెడుతున్నారు.

విదేశాలకు వెళ్లే వారికి చెకప్

జిల్లా నుంచి ఎంతోమంది విదేశాలకు వెళ్తుంటారు. వీరు అన్ని పరీక్షలు చేయించుకొని మెడికల్ రిపోర్ట్స్ తీసుకొని వెళ్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న ల్యాబ్ నిర్వాహకులు విదేశాలకు వెళ్లే వారికి పరీక్షలు చేస్తూ అంతా బాగానే ఉన్నట్లు రిపోర్ట్‌లు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏకంగా ల్యాబ్‌ల ముందు విదేశాలకు వెళ్లే వారికి చెకప్ చేయబడునని బోర్డులు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న వైద్యశాఖ

చిన్నచిన్న గల్లీల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తూ ఎక్కబడితే అక్కడ రక్త పరీక్షలు చేస్తున్నా వైద్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. తనిఖీలు చేయాల్సిన అధికారులు కనీసం చర్యలు తీసుకోవడం లేదు. జిల్లాలో కనీసం 200కి పైగా రక్తపరీక్ష కేంద్రాలున్నాయి.

చర్యలు తీసుకుంటాం



ల్యాబ్‌లో ఎంబీబీఎస్ వైద్యుడితో పాటు పాథాలజిస్ట్, మైక్రో బయాలజిస్ట్ ఉండాలి. ఎక్కబడితే అక్కడ ల్యాబ్‌లు ఏర్పాటు చేయొద్దు. తప్పనిసరిగా వైద్యశాఖ అనుమతులు తీసుకోవాలి. ల్యాబ్‌ల్లో కావాల్సిన మిషన్లను సమకూర్చుకోవాలి. కొన్నింటిని ఇప్పటికే సీజ్ చేశాం. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, డీఎంహెచ్‌వో

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

వేములవాడ : పట్టణంలోని చెక్కపల్లి రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని లాలపల్లికి చెందిన తేలు కనుకయ్య (50) తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పెద్దమ్మ జంక్షన్ వద్ద ఎదురుగా బైక్‌పై వస్తున్న యువకుడిని తప్పించబోయే క్రమంలో ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కనుకయ్య అక్కడికక్కడే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే కనుకయ్య మృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో రైతు..

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌కు చెందిన అనిల్ రెడ్డి (38) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం సాయంత్రం గుండెపోటుతో చనిపోయినట్లు తెలిపారు. అనిల్‌రెడ్డి పదేళ్ల క్రితం విలేకరిగా పనిచేశాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బెదిరింపులకు పాల్పడ్డ ఇద్దరి బైండోవర్

వేములవాడ: వేములవాడలో మాజీ నక్సలైట్లమంటూ చెప్పుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్న స్థానిక సాయినగర్‌కు చెందిన జంగిడి బాబు, వేములవాడరూరల్ మండలం నూకలమర్రికి చెందిన బొడ్డు నారాయణలను శనివారం తహసీల్దారు ముందు బైండోవర్ చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. సదరు వ్యక్తులు ఎవరినైనా బెదిరింపులకు గురిచేస్తే 8712656412లో తెలపాలని డీఎస్పీ కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిరిసిల్లక్రైం : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని కొండాపూర్ నుంచి సిరిసిల్లలోని లక్ష్మీ ఇండస్ట్రీస్‌కు గుంట సంయోల్ అనే వ్యక్తి 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడన్న సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. టీఎస్ 01 యూబీ 4798 నంబర్ గల ట్రాలీ ఆటోను కలెక్టరేట్ జంక్షన్‌లోని రగుడు చౌరస్తా వద్ద పోలీసులు పట్టుకున్నారు. సంయోల్‌ను అదుపులోకి తీసుకొని బియ్యం, ఆటోను సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు మారుతి, శ్రీకాంత్, రాజేశ్, తిరుపతి, మహిపాల్, శ్రీనివాస్, మహిపాల్, అక్బర్, సమీయొద్దీన్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని అష్టలక్ష్మీ నగర్‌లో స్థలంలోకి అక్రమంగా ప్రవేశించడం తోపాటు బోరువేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. కృష్ణానగర్‌కు చెందిన ఎండీ.అంకూస్‌కు అష్టలక్ష్మీ దేవాలయం వద్ద 61 గుంటల భూమి ఉంది. దాని పక్కన సాయిరాం నగర్‌కు చెందిన పోతుగంటి సింహాద్రికి కూడా స్థలం ఉంది. ఇద్దరి మధ్య భూ వివాదం ఉండగా, ప్రభుత్వ ల్యాండ్ సర్వేయర్ హద్దులు నిర్ణయించి వెళ్లారు. రెండ్రోజుల క్రితం సింహాద్రి హద్దులను తొలగించి అంకూస్ స్థలంలోకి ప్రవేశించి బోరు వేయడం తోపాటు కందకం తవ్వించాడు. దీంతో ఇదేమిటని అంకూస్ అడుగగా బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సింహాద్రిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి



అక్షిత రెడ్డి (ఫైల్)

జగిత్యాలక్రైం: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన బాలిక చికిత్స పొందుతూ మృతిచెందింది. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన అక్షిత రెడి(16) 46 రోజుల కింద పదో తరగతిలో తక్కువ మార్కులు వచ్చాయని పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్షిత రెడ్డి ఆరోగ్య పరిస్థితి కుదుట పడకపోవడంతో పదిరోజుల క్రితం స్వగ్రామానికి తీరురాగా, శనివారం మృతిచెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీర్‌పూర్‌లో యువతి ..

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రం ఆసునూరిగూడెంకు చెందిన యువతి ఆత్మహత్య యత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతిచెందిందని పోలీసులు తెలిపారు. ఏఎస్‌ఐ ర వీందర్ కథనం ప్రకారం.. బీర్‌పూర్ శివారు గ్రా మం ఆసునూరిగూడెంకు చెందిన మార్నేని నర్మ ద (19) అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 3న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

'పేదల ఇళ్ల జోలికి వస్తే సహించం'

సిరిసిల్ల అర్బన్: నిరుపేదల ఇళ్ల జోలికి వస్తే ఊరుకునేది లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని ఈదుల చెరువు సమీపంలో నివాసముంటున్న కాలనీ వాసుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్ల క్రితం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకోగా ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. అప్పటి నుంచి అన్ని పన్నులు వసూలు చేస్తున్నారని, ప్రస్తుతం వీరు ఉంటున్న 84 ఇళ్లకు అధికారులు రెడ్‌మార్క్ వేసి బఫర్ జోన్‌గా ప్రకటించడం సరికాదన్నారు. రాజీవ్‌నగర్ శివారులో వందల ఎకరాలు అన్యాక్రాంతమైనా పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడ కరకట్టను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పట్టణ కార్యదర్శి పంతం రవి, సో మ నాగరాజు, లక్ష్మణ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

మల్యాల (చొప్పదండి): మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కమ్మరి రాజన్న కొన్ని రోజులుగా గుండె, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చేర్పించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో స్థానికులు సాయం చేశారు. నాలుగు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రాజన్న పరిస్థితి విషమంగా ఉంది. వైద్యం కోసం సుమారు రూ.లక్ష ఖర్చవుతుందని వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఫోన్ పే 6304121631 నెంబర్ ద్వారా దాతలు ఆర్థికసాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.


పోయిన సొత్తు మళ్లీ గుడిలో ప్రత్యక్షం



శనివారం ఉదయం గుడిలో దొరికిన సొత్తు

కోరుట్ల: రెండ్రోజుల క్రితం కోరుట్ల పట్టణంలోని భీమునిదుబ్బలో ఉన్న లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయంలో చోరీకి గురైన సొత్తు శనివారం ఉదయం మళ్లీ గుడిలోనే దొరకడం చర్చనీయంగా మారింది. శుక్రవారం తెల్లవారుజామున లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలోని బంగారు, వెండి నగలు, హుండీలోని నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై ఆలయ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం ఆలయ నిర్వహణ చూసే లక్ష్మయ్య ఎప్పటిలాగే ఉదయం ఆలయం వద్దకు వెళ్లగా బంగారు, వెండి నగలు ఓ సంచిలో ఉన్నాయి. దీంతో ఎత్తుకెళ్లిన సొత్తు మళ్లీ దొరకడం చర్చనీయంగా మారింది.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



ధర్మరాజు మృతదేహం

మల్లాపూర్ : కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మొగిలిపేటలో శనివారం జరిగింది. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధర్పల్లి ధర్మరాజుకు (26) మూడేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన కావ్యతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నిరోజుల నుంచి భార్యతో గొడవ జరుగుతుంది. శుక్రవారం సాయంత్రం మళ్లీ గొడవ జరగడంతో పిల్లలను తీసుకొని బంధువుల ఇంటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన ధర్మరాజు శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి ధర్పల్లి పెద్ద గంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల – ధర్మపురి ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గొల్లపల్లి మండలం వెంగళాపూర్ గ్రామానికి చెందిన కొత్తూరి రాధ భర్త ఇషాక్‌తో కలిసి ద్విచక్రవాహనంపై శనివారం తల్లిగారి గ్రామమైన జగిత్యాల రూరల్ మండలం పొలాసకు వెళ్తున్నారు. మార్గమధ్యలో కల్లెడ-తక్కళ్లపల్లి గ్రామ శివారులో వీరి ద్విచక్రవాహనాన్ని టాటా ఏసీ వాహనం ఢీకొనడంతో ఇద్దరికీ తీ వ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో జగి త్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాధ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు.

జగిత్యాల కోటను పరిశీలించిన ఆర్కిటెక్ విద్యార్థులు



జగిత్యాల కోట వద్ద విద్యార్థులు

జగిత్యాల: జగిత్యాల కోట కాకతీయుల నాటి కట్టడం, చాలా ప్రాముఖ్యత కలిగిన కోట అని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ హైదరాబాద్ విద్యార్థులు, ప్రొఫెసర్లు పేర్కొన్నారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విభాగంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు కోట, జగిత్యాల పరిసరాలు, క్లాక్ టవర్ చుట్టూ ఉన్న నివాసాలు, తదితర చారిత్రక అంశాలను తెలుసుకున్నారు. జేఎన్ఏఎఫ్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ పద్మశ్రీ, ఆర్కిటెక్ట్ బిందు భార్గవి, ఆదిత్య మూర్తి, విద్యార్థులు ఉన్నారు. అదనపు కలెక్టర్ మకరంద్‌ను విద్యార్థులు కలిశారు.

ఏబీవీపీ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కోరుట్ల : ప్రైవేటు పాఠశాలలకు జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారులు వత్తాసు పలుకుతున్నారని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి మాడవేణి సునీల్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్నారని పాఠశాల ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తూ, అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నా ఎంఈవో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఏబీవీపీ జోనల్ ఇన్‌చార్జి పవన్, సంజీవ్, మహదేవ్, ప్రణయ్, సాయిచందు, సూరజ్, వినయ్, అభిరామ్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి



లింగం మృతదేహం

మల్యాల (చొప్పదండి): అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని రాజారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన మోటం లింగం (60) నాటు వైద్యం చేసేవాడు. మల్యాల మండలం రాజారం గ్రామ శివారులో చెట్ల పొదల్లో అనుమానాస్పద స్థితిలో పడి ఉండగా స్థానికులు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. స్కూటీతో సహా చెట్లపొదల్లో పడి ఉండడంతో ఎవరైనా హత్యచేశారా.. గుండెపోటుతో మృతిచెందాడా అని ఉంటాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ధాన్యం డబ్బుల కోసం రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి(కోరుట్ల): ధాన్యం డబ్బులను వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో స్థానిక పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులు శనివారం రాస్తారోకో చేశారు. ధాన్యం కొనుగోలు చేసి నెలరోజులు గడిచినా డబ్బులు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. వానాకా లం సీజన్ ప్రారంభం కావడంతో పెట్టుబడి కోసం రైతులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. వెంటనే ధాన్యం డబ్బులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు పిడుగు తిరుపతిరెడ్డి, అందె మారుతి, రాంప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం



పూజలు చేస్తున్న అధికారులు తదితరులు

కథలాపూర్(వేములవాడ): తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీ సీఈవో రామానుజాచారి అన్నారు. భీమారం మండలం పసునూర్, కథలాపూర్ మండలం రాజారాం తండా, కలిగోట గ్రామాల్లో శని వారం గిరిజన దినోత్సవం నిర్వహించారు. సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గిరిజనులు ఆటాపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో గంగాధర్, సర్పంచులు లచ్చ నాయక్, సరిత, సరోజ తదితరులు పాల్గొన్నారు.

19న హరితహారం ప్రారంభం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

సారంగాపూర్(జగిత్యాల): తొమ్మిదో విడత హరిత హారం కార్యక్రమాన్ని ఈనెల 19న స్థానిక అటవీ ప్రాంతాల్లో ప్రారంభిస్తామని డీఎఫ్‌వో వెంకటేశ్వర్ రావు, డీఆర్డీవో లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక బతుకమ్మకుంట ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంత్రి ఈశ్వర్ తదితరులు ప్రారంభిస్తారన్నారు. హరితహారం ద్వారా ఈసారి 24 లక్షల మొక్కలు నాటుతామని తెలిపారు. 19న జగిత్యాల నియోజకవర్గంలోని సారంగాపూర్, కోరుట్ల నియోజకవర్గంలోని మెట్‌పల్లి మండలం వెంకట్రావుపేట, ధర్మపురి నియోజవర్గంలో నేరెళ్లలో మొక్కలు నాటుతామని చెప్పారు. సారంగాపూర్‌లో తొలిరోజు విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలతో కలిపి సుమారు 2 వేల మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎఫ్ఎస్‌వో బుర్ర మహేశ్‌గౌడ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, టీఏ శ్రీలత, శివ, సీవో సూర కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఏజెంట్లను నమ్మొద్దు



నరేశ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కోరుట్లరూరల్: నకిలీ గల్ఫ్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని గల్ఫ్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గుగ్గిళ్ల రవిగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ సూచించారు. వెంకటాపూర్‌లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న గల్ఫ్ కార్మికుడు పిట్టల నరేశ్ కుటుంబసభ్యులను శనివారం వారు పరామర్శించి మాట్లాడారు. నరేశ్ కుటుంబానికి రూ.5లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపసర్పంచ్ ఎండీ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

పాప మృతికి కారకులను శిక్షించాలి

సిరిసిల్లటౌన్: పసికందు మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన రఘుపతి కోరారు. శనివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదిరోజుల క్రితం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తన భార్య వీణను ప్రసవం కోసం తీసుకెళ్లగా పాప పుట్టిందన్నారు. వైద్యులు పాప ఆరోగ్యంగా ఉందని చెప్పారని, రెండుగంటల తర్వాత పాపను వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని పంపించినట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి పాపను తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. ఈ విషయమై వేములవాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేయగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి స్పందించి మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. బాధితుడికి ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు భీమ్ కీర్తన, ప్రధాన కార్యదర్శి ఉల్లెందుల అరుణ్, ఉపాధ్యక్షుడు ఎడవెల్లి బాబు సంఘీభావం తెలిపారు.